ప్రమాదకర ప్రయాణం

- పలు పల్లెలకు ఆర్టీసీ సౌకర్యం నిల్
- విద్యార్థులు, కూలీలకు ప్రైవేట్ వాహనాలే దిక్కు
- బస్సులు నడపాలని జనం వేడుకోలు



నల్లచెరువు: జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనపడకుంగా కప్పేసిన పొగమంచు



వ్యవసాయ కూలీలతో కిక్కిరిసిన ఆటో

నల్లచెరువు: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం. అయితే కొన్ని పల్లెలకు బస్సు సౌకర్యం లేదు. ఆటోలు, బొలెరో, ట్రాక్టర్లు తదితర వాహనాలే దిక్కయ్యాయి. ప్రైవేట్ వాహనదారులు ఆదాయం కోసం పరిమితికి మించి తరలిస్తుండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండలంలోని పంతులచెరువు, తవళంమర్రి, మద్దిమడుగు, ఉబిచర్ల మీదుగా ఆర్టీసీ బస్సులు లేవు. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులు, కూలీలు ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణిస్తుంటారు. వేగంగా వెళ్లినపుడు మలుపుల వద్ద, స్పీడ్ బ్రేకర్ల వద్ద సడన్ బ్రేకు వేస్తే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు. పట్టించుకోని అధికారులు ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటే ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది. కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్లే సమయంలో పొగమంచుతో దారి కానరావడం లేదు. ప్రమాదాలు జరగకుముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దేవిరెడ్డిపల్లి వద్ద ఆటో అంచున కూర్చుని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

బస్సు సౌకర్యం కల్పించాలి

మండలంలోని పంతుల చెరువు, తవళంమర్రి, మద్దిమడుగు, ఉబిచర్ల గ్రామాల మీదుగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు, పలు గ్రామాల జనం కోరుతున్నారు.

కిశోర బాలికల ఆరోగ్యం, సంరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరంగారావు.

తాడిమర్రి: కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యం, సంరక్షణే ధ్యేయంగా పనిచేయాలని ఎంపీడీఓ వెంకటరంగారావు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీఓ సరస్వతి అధ్యక్షతన 'కిశోరి వికాసం'లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో 11 నుంచి 18 ఏళ్ల వయసు బాలికలతో కిశోరి వికాసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కమిటీల సమావేశాలు ఏర్పాటు చేస్తూ బాలికల వ్యక్తిగత ఆరోగ్యం, సంరక్షణ, లైంగిక వేధింపులు, బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. బాలికల విద్య, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపరుచుకునేలా వారిని పోత్సహించాలన్నారు. తద్వారా వారికి బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఆయన తెలిపారు. సీడీపీవో సరస్వతి మాట్లాడుతూ కిశోరి వికాసం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సునంద, సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చెన్నకేశవస్వామి

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం చెన్నకేశవపురం చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల వివరాలను ధర్మకర్తలు ఉషారాణి, చన్నారెడ్డి బుధవారం మీడియాకు వెల్లడించారు. ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పణ, పూజ, సాయంత్రం 4 గంటలకు మహాభిషేకం నిర్వహించారు. తొమ్మిదో తేదీ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు పూజా కార్యక్రమాలు, హోమాలు, సాయంత్రం 4 గంటలకు సుదర్శన హోమం, గరుడ వాహనసేవ, పదో తేదీ తెల్లవారుజామున 4 గంటలకు ద్వారకప్రవేశం, 8 గంటలకు హోమాలు, పూర్ణాహుతి, నూతన కల్యాణ వేదిక ప్రారంభోత్సవం, కల్యాణ మహోత్సవం, సాయంత్ర 4 గంటలకు చక్రస్నానం, ధ్వజావరోహణ, శ్రీవారి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

హంద్రీ-నీవా నీటితో రైతులను ఆదుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తాడిమర్రి: కర్నూలు జిల్లా మల్యాల నుంచి కుప్పం వరకు ఆరు లక్షల ఎకరాలకు హంద్రీ–నీవా ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య ప్రభుత్వాన్ని కోరారు. తాడిమర్రిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాలువ నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. లైనింగ్ (సిమెంట్ కాంక్రీట్) లేకుండా కాలువ నిర్మించాలని, అప్పుడే భూగర్భజలాలు పెరిగి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. హంద్రీ–నీవా కాలువకు పిల్ల కాలువలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ డివిజన్ కార్యదర్శి మధు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుళ్లాయప్ప, మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలి

- జిల్లాలోని అన్ని మండలాలనూ కరువు జాబితాలో చేర్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న విలేకరులతో మాట్లాడారు. పంటలు పండక నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మారుతి, పోతలయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమకు పూర్వ వైభవం తేవాలి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు

ఎన్పీకుంట: మల్బరీ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని పట్టుపరిశ్రమకు పూర్వ వైభవం తేవాలని సెరికల్చర్ అధికారి బాబాఫక్రుద్దీన్, మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి కోరారు. మండల పరిధిలోని వెలిచలమల, గొకనపల్లి రైతు సేవ కేంద్రాల పరిధిలో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పడమరనడిమి పల్లి రైతు బ్రహ్మానందరెడ్డి సాగు చేసిన మల్బరీ తోటను పరిశీలించి, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు కృష్ణానాయక్, స్వర్ణకుమారి, హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: బసంపల్లి గ్రామంలో దళితులు మరణిస్తే ఖననం చేయడానికి పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. బుధవారం గ్రామంలోని దళితులతో కలసి తహసీల్దార్ సురేష్ కుమార్‌ను కలసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బసంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 17–1లో 1.39 ఎకరాల భూమిని మాల కులస్తుల శ్మశానం కోసం కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. అయితే గ్రామంలోని కొందరు శ్మశాన స్థలాన్ని ఆక్రమించుకుని అందులో చెట్లు నాటారన్నారు. ఏళ్ల తరబడి శ్మశానం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కాలనీలో ఎవరైనా మరణిస్తే ఖననం చేయడానికి పోలీసులు, అధికారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీఏ సేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న ఎంవీఐ రాణి

ధర్మవరం రూరల్: ఆర్టీఏ సేవలను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మవరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రాణి సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వాహనదారుల సౌకర్యార్థం ధర్మవరం మార్కెట్‌యార్డ్‌లో మోటార్ వెహికల్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యాలయ పరిధిలోకి ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలు వస్తాయన్నారు. ఎల్‌ఎల్‌ఆర్‌లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, వాహన ట్రాన్స్‌ఫర్ మార్పులు, చేర్పులు, కొత్తగా వాహనాల రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయన్నారు.

రీసర్వే విజయవంతం చేయండి

పుట్టపర్తి అర్బన్: త్వరలో చేపట్టనున్న భూముల రీసర్వేను రెవెన్యూ అధికారులు, సిబ్బంది కలసికట్టుగా విజయవంతం చేయాలని ఆర్డీఓ సువర్ణ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మొదట రీ సర్వేను డ్రోన్‌లు, రోవర్లతో నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దులు, రోడ్లు, దేవాలయాలు, మసీదులు, చర్చిలను గ్రామ పటంలో గుర్తించాలన్నారు. రైతుల భూముల సరిహద్దులు, గట్టు సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. మొదట రీసర్వేలో కొండలు, వాగులు, చెరువులను గుర్తించాలన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షునికి సన్మానం

ధర్మవరం: బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ఎంపికైన జింకా చంద్రశేఖర్‌ను పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు పుత్త రుద్రయ్య, కార్యదర్శి జింకా నాగభూషణం, కమిటీ సభ్యులు బుధవారం మార్కండేయస్వామి ఆలయంలో ఘనంగా సన్మానించారు.

వైభవంగా ఊరు దేవర



అలంకరణలో పెద్దమ్మ దేవత

కనగానపల్లి: మండలంలోని సోమరవాండ్లపల్లి గ్రామంలో బుధవారం పెద్దమ్మ స్వామి ఊరు దేవరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దమ్మ దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దీంతో పాటు గ్రామంలోని మహిళలు, యువకులు జ్యోతులతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ దేవరలో పాల్గొనేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చెన్నేకత్తపల్లి: న్యామద్దెల ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అన్నం సుధాకర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

అమడగూరు: గాజులపల్లి సమీపంలోని శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి కొత్తచెరువు మండలం యరపల్లికి చెందిన పీఏసీఎస్ విశ్రాంత ఉద్యోగి వెంకటరామప్ప బుధవారం రూ 10 వేల నగదు వితరణ చేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాల్య వివాహాలు చేయరాదు



మాట్లాడుతున్న టింబక్టు కలెక్టివ్ సిబ్బంది

రామగిరి: ప్రస్తుత సమాజంలో మహిళల పాత్ర చాలా కీలకమని టింబక్టు కలెక్టివ్ సీఈఓ కాంచన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోలేపల్లిలో టింబక్టు కలెక్టివ్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయరాదన్నారు. బాలికలను బాగా చదివించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. అలాగే కుటుంబంలో జరిగే పరిణామాలు, సమస్యలను ఎదుర్కొనేలా మహిళలు జాగ్రత్తపడాలన్నారు. పలు అంశాలపై నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళాశక్తి సొసైటీ అధ్యక్షురాలు సున్నమ్మ, సిబ్బంది గౌరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

ఎన్పీకుంట: మరికొమ్మదిన్నె గ్రామ పొలంలోని ప్రభుత్వ భూములను బుధవారం ఆర్డీఓ వీవీఎస్ శర్మ తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ భూములు, సాగురైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూముల స్కెచ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సర్వేయర్ జిలాని, వీఆర్ఓ రఘు, వీఆర్ఏ బాబు, గ్రామసర్వేయర్ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప ఆలయానికి రూ.1,01,116 విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న శివమ్మ

గాండ్లపెంట: మండల కేంద్రంలోని చిన్నమిట్ట వద్ద నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయానికి అల్లుగుండకు చెందిన భక్తురాలు తలమర్ల శివమ్మ రూ.1,01,116 నగదును బుధవారం శ్రీధర్మశాస్త ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. శివమ్మ భర్త ఐదేళ్ల క్రితం చనిపోయారు. వీరికి పిల్లలు లేరు. భర్త సంపాదనలో దాచుకన్న నగదు, వితంతు పింఛన్ ద్వారా పొదుపు చేసుకున్న డబ్బును కలిపి తాను, తన భర్తపేరు చిరస్థాయిగా ఉండాలనే ఉద్దేశంతో రూ.1,01,116 నగదును అందజేసినట్లు శివమ్మ తెలిపారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా శెట్టిపి జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన శెట్టిపి జయచంద్రారెడ్డి ఎంపికయ్యారు. బుధవారం కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన 17వ యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలలో రాష్ట్ర నాయకులు శెట్టిపి జయచంద్రారెడ్డిని ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లాలో దక్షిణ ప్రాంతం నుంచి 50 ఏళ్ల తర్వాత మొదటిసారి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికకావడంపై ధర్మవరం జోన్ నాయకులు రామకృష్ణనాయక్, అంజనేయులు, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, రాంప్రసాద్, హరికృష్ణ, బిల్లే రామంజనేయులు, సాయిగణేష్, హెచ్.రామంజనేయులు, హరిశంకర్, మేరివరకుమారి, లతాదేవి, నాగేంద్రమ్మ, రమీజాబి, నాగిరెడ్డి, జనార్దన్, కిషోర్, మైనుద్దిన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

డ్యూటీ సర్టిఫికెట్ల జారీకి వినతి

కదిరి అర్బన్: గత ఎన్నికల్లో ఓపీఓలుగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బుధవారం కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు వరదారెడ్డి, ప్రతిమా తరంగిణి, శిల్ప, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు తెలిపారు. పీఓలు, ఏపీఓలకు అప్పుడే డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేసి, ఓపీఓలకు మాత్రం ఇంతవరకు జారీ చేయలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయించి ఈఎల్ ఎంట్రీకి అవకాశం కల్పించాలని విన్నవించారు.

సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ విద్యాసంస్థల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. ముందస్తుగా సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేసేలా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, కార్యదర్శి శ్రీదేవి హాజరై ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

చెన్నేకొత్తపల్లి: పైలబోయలపల్లి గ్రామ సమీపంలో ఎత్తయిన కొండల నడుమ కొలువైన కసుమ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ తెల్లవారుజాము నుంచే భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. విచ్చేసిన భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయడం చేస్తామని పేర్కొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు



ప్రయోగాలను పర్యవేక్షిస్తున్న డివిజనల్ డీవై ఎస్‌ఓ గోపాల్

బత్తలపల్లి: గరిశలపల్లిలో బుధవారం కందిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. డివిజనల్ డీవై ఎస్ఓ గోపాల్ ఆధ్వర్యంలో ఎంపీఈఓ రవి పంట కోత ప్రయోగాలు చేశారు. కార్యక్రమంలో బీమా కంపెనీ కో ఆర్డినేటర్లు మంజునాథ్, శ్రీనివాస్, ఎర్రిస్వామి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, రైతులు పాల్గొన్నారు.

కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి



సానే రవీంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: మున్సిపల్ టీచర్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడుగా సానే రవీంద్రారెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో బుధవారం ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణరెడ్డి సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడుగా సానే రవీంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడుగా రమేష్‌బాబు, కార్యదర్శిగా రామకృష్ణనాయక్, డైరెక్టర్లుగా అమానుల్లా, రాంప్రసాద్, అంజినాయక్, సాయిగణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'తల్లికి వందనం' అమలు చేయాల్సిందే

ధర్మవరం: రాష్ట్రంలో 'తల్లికి వందనం' పథకాన్ని ఈ విద్యా సంవత్సరమే అమలు చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద బుధవారం విద్యార్థులతో కలిసి పీఎస్‌యూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకపోవడం సరికాదని అన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఎస్‌యూ పట్టణ అధ్యక్షుడు నందకిషోర్, భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి మెగా షటిల్ టోర్నీ

ధర్మవరం అర్బన్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 11 నుంచి 15 వరకు పట్టణంలోని రేగాటిపల్లి రైల్వే గేటు సమీపాన ఎమ్మార్సీ ఆవరణలో మెగా షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకుడు కృష్ణప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. టోర్నీలో మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు, నాల్గవ బహుమతి రూ.వెయ్యి చొప్పున అందించనున్నామని తెలిపారు. ధర్మవరం క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డే బాలాజీ మొమెంటోలు వితరణ చేశారని తెలిపారు. క్రీడాకారులు 99852 56682, 95159 75003, 91825 21800 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ఎన్పీకుంట: మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. బుధవారం వెలిచలమల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా భూ సమస్యలకు సంబంధించి 200 అర్జీలు వచ్చాయని, వీటిలో గ్రామస్థాయిలోనే 40 అర్జీలు పరిష్కరించామని చెప్పారు. మిగిలిన వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని వినతి

ధర్మవరం: పట్టణంలోని రంగా థియేటర్ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటుకు మార్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు అనుకుని ఉండటంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెల క్రితం వృద్ధురాలు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిందని, ఆమెకు విద్యుత్ శాఖ తరఫున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మరొక చోటుకు మార్చి ప్రమాదాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకల రాజా, పట్టణ నాయకులు బాల రంగయ్య, సురేష్, ఆదినారాయణ, శ్రీనివాసులు, కేశవ, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

మలుపులో రెండు కార్లు ఢీ

బత్తలపల్లి: గంటాపురం మలుపు వద్ద బుధవారం రెండు కార్లు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లి నుంచి ఓ కుటుంబం గంటాపురానికి కారులో వెళ్తోంది. ఇదే సమయంలో కదిరి నుంచి అనంతపురానికి వెళ్తున్న మరో కారు గంటాపురం మలుపు వద్ద ఢీకొంది. రెండు కార్లలోనూ ఏడుగురు మనుషులు ఉన్నారు. సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన కార్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొడరాళ్లపల్లిలో ముగ్గుల పోటీలు

ముదిగుబ్బ: శాంతి ఆనంద్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం పొడరాళ్లపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 80 మంది మహిళలు పాల్గొన్నారు. ముఖ్య అతిథి ఎంఈఓ రమణప్ప మాట్లాడుతూ మహిళల్లో ఉండే సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి ముగ్గుల పోటీలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం మహిళలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శాంతి ఆనంద్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హల్గా శాంతి, సొసైటీ ప్రెసిడెంట్ చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయుడు బొగ్గు రాజశేఖర్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తులకు భోజన వసతి

ధర్మవరం అర్బన్: పాడేరు నుంచి పుట్టపర్తికి రైలులో వెళ్లే సత్యసాయిబాబా భక్తులకు భోజన వసతి కల్పించామని శ్రీసత్యసాయి సేవా సమితి సేవాదళ్ సభ్యులు తెలిపారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో బుధవారం పాడేరు – పుట్టపర్తి వెళ్లే సత్యసాయి భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం తిరిగి పాడేరుకు వెళుతున్న భక్తులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

సృజన వెలికితీసేందుకే పోటీలు

బత్తలపల్లి: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, విశ్రాంత ఉపాధ్యాయుడు అనంతయ్య పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో మానతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ మాధవి, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.